నాటకం

1

శుద్ధ అప్రయోజకుడనే నింద పోగొట్టుకోవాలనేకోర్కెతో సూరాయ ఆలోచించాడు. సునాయాసంగా, ఒక సంచిరూపాయలు సంపాదించే అనాయాసమైన మార్గ మేదా యని. వాడు జన్మెత్తింది మొదలు తన శక్తివల్ల ఒక్క అరగానీ తెచ్చుకోలేదు. చాలాకాలం కష్టపడే వోపిక తనకి వుండదని తెలుసు, లాటరీ వేద్దామనుకున్నాడుగాని వెయ్యడానికి ముందు కానీలేదు, తీవ్రమైన ఆలోచనలు చెయ్యగా నాటకం వేయించడం సులభమార్గంగా తోచింది. నాటకం కంట్రాక్టు తీసుకోవాలంటే, తనని నమ్మేదెవరు కాదు, తానే నాటకం వేయిస్తే కీర్తివస్తుంది. తన వేషం వేస్తే యింక చెప్పాలా? తనసంగతి కనిపెట్టేవారు లేరుగాని, తనతో పాడగలిగినవాడు యీ ఆంధ్రదేశంలో లేడని అతనికి గట్టినమ్మకం. అదిగాక నాటకం వెయ్యాలంటే పెట్టుబడి యేమాత్రమూ అక్కరలేదు. బావుంది. కాని రావులపర్రులో నాటకానికి టిక్కెట్లు కొని వొచ్చేవాడెవడు? ఏదన్నా వూరుపోయి వెయ్యాలి. రైలుఖర్చులేదు; నాటకంసంగతి చెప్పి బాబుని రైలుఖర్చిమ్మంటే, ముందు తంతాడు-సరేనని కాచుకొనివున్నాడు, సమయంకోసం.

చివరకి - పండక్కి శెలవలకి బావని తీసుకురమ్మని కాకినాడ పొమ్మన్నాడు తండ్రి. మంచి సందుదొరికింది. రానుపోను రైలుఖర్చులు తీసుకున్నాడు. రైలెక్కాడు. ఎక్కినప్పటినించి నాటకం సంగతే ఆలోచన. ఏనాటకానికి తక్కువ పాత్రలు కావాలి? పుస్తకాలమ్మేవాడొచ్చాడు. పుస్తకాలన్నీ గంట తిరగేసి చివరికి హరిశ్చంద్రలో తక్కువ పాత్రలు కావాలని తేల్చాడు, తెలిసిన నాటకమూ రసవంతమయినదీ అని. అసలు లోహితాస్యుడి పేరు ఎత్తితే చాలు పిల్లలు చచ్చిన తల్లులందరూ కన్నీళ్లు కారుస్తారు. ముసలివాళ్ళందరూ స్మశానం చూసి వొణుకుతారు. నాటకం పాడుచెయ్యటానికి ఎవడికీ శక్తివుండదు. ఆ నాటకంలో హరిశ్చంద్రుడి నమ్మే పద్యమూ, చంద్రమతిని నరికేప్పటి వచనమూ వచ్చు అతనికి, ఆ పుస్తకం బేరంచేసి నాలుగోవంతు ఖరీదుకు కొని, పోర్షన్ తిరగేస్తున్నాడు. హరిశ్చంద్రుడి పోర్షన్ చదివినకొద్దీ, ఆ పాత్రని తనకోసమే కవి కల్పించినట్లుంది. కవేమిటి! తన వేషంకోసమే, ఆ రాజుని బ్రహ్మ కృతయుగంలోసృజించాడు. విశ్వామిత్రుడి కాళ్ళమీదపడేప్పుడు రాజఠీవి వొలికేట్టు ఎట్లా తేవాలో ఎట్లా సలాము పెట్టాలో, ప్రేమ వొలికేట్టు చంద్రమతివంక ఎట్లా చూడాలో ఆలోచిస్తూ లేచినుంచుని చూసుకుంటున్నాడు. ఇదీ ఏదో కొంత పొద్దుపోతుందని పెట్టెలో వాళ్లు అతనికేసి చూస్తున్నారు. ఇంతలో పద్యం అందుకొని చదువుతున్నాడు. అతని కంఠం అతనికే యింపుగా వుంది. చివర చప్పట్లు కొట్టినట్టే వినబడ్డాయి. ఇంకోపద్యం మొదలుపెట్టబోతో తోడిరాగంలో హార్మోనియం వాడు

తనకి ముందు అందిస్తున్నట్లు ఊ అని, హార్మోనియం శబ్దం చేస్తున్నాడు. ఇదంతా చూస్తున్న బ్రాహ్మడొకాయన "ఏవూరండీ?" అన్నాడు. వినిపించుకోలేదు, పద్యం ఆరంభించాడు. మధ్యలో ఆపి, కొంచెం బాగా, రాగంలేకుండా, వచనంవలె చదివి, ఆడియన్సు వేపు చూసేప్పటికి ఆయన మళ్ళీ,

"ఏవూరండీ?" అన్నాడు.

సంగీతమాపి సంభాషనలోకి దిగాడు.

"మీదేవూరండీ" అని సూరాయ్ ఆయన్నడిగాడు.

"కనగాల"

"ఎక్కడికి వెళుతున్నారు?"

"కడియం"

"ఎందుకు?"

"పెళ్ళికి"

"ఎవరిపెళ్ళికి?

"మీరేమిటి పాడుతున్నారు?"

"హరిశ్చంద్ర"

"ఓ, చాలా మంచి పుస్తకం, అందమైన పద్యాలు"

"మీరు చదివారా?"

"ఆ"

"పద్యాలు వచ్చునా?"

"నక్షత్రకుడివి వచ్చు"

"అవిమాత్రమే ఎలావచ్చు?"

"ఆ వేషం వేస్తాను"

"ఆ....తమ నామధేయం ?"

"ఎడవల్లి నాగభూషణం"

"ఓ, తమరా? చాలా సుదినం, పెళ్ళి ఎన్ని రోజులు?"

"ఐదు"

"మీరు లగ్నాని కుండి రాలేరూ?"

"ఎందుకు?"

"కాకినాడలో నాటకం-హరిప్రసాదరావుగారు హరిశ్చంద్రుడు వేస్తానన్నారు. చంద్రమతి జగ్గారావుగారు-నక్షత్రుడికి అసలు గ్రంథకర్తే వచ్చితీరతానని బతిమాలుకున్నారు. కాని వాళ్ళ బంధువుల్లో ఉపనయనం ఒకటి వచ్చింది. రావడానికి వీలు లేదు అన్నారు. అందుకని తమరు...."

"తప్పకుండా వొస్తాను"

"ఎల్లుండిరాత్రి నాటకం హాలుదగ్గరకు సరాసరి వచ్చెయ్యండి"

"తప్పకుండా"

"అక్కడే రయిలుచార్జీలు యిచ్చేస్తాను"

"సరే, దానికేంలెండి"

సూరాయ్ కాకినాడ చేరుకునేలోపల హరిశ్చంద్రపార్టు అంతా వొల్లించాడు. కొంచెంసేపట్లో ఆ పెట్టెలో వాళ్ళంతా దిగారు. భేతాళుడిమీద యితను చెయ్యి విసరడాలూ, అవీ చూసి ఏ స్టేషనులోనూ ఎవరూ ఎక్కలేదు.

2

కాకినాడలో దిగి బావగారి యింటికి వెళ్లాడు.

"ఏమిరా, తమ్ముడూ, ఎప్పుడు రావడం?"

"వ్యవహారంమీద వొచ్చాను"

"వ్యవహారం? నీకు వ్యవహారమేమిటి?"

"నన్ను తీసుకొచ్చారు."

"ఎవరు? బుద్ధివున్నవాళ్ళేనా?"

"నాటకంవాళ్లు"

"సరేలే. ఐనా, వాళ్ళకిమాత్రం నువ్వెందుకు?"

"ఎందుకు తీసుకొస్తారు? వేషం వెయ్యడానికి"

"వేషాలేమిటిరోయి!"

"హరిశ్చంద్ర"

తమ్ముడి మతి పోయిందని ఊరుకుంది.

"ఎల్లుండి మీయిద్దరూ బయలుదేరి రావాలి"

"ఎక్కడికి?"

"నాటకానికి"

"నాటకానికా? ఇంకా తీసుకురమ్మని నాన్న నిన్ను పంపాడేమో ననుకున్నాను."

"అవునవును. అదికూడాను. ఎట్లాగూ వెడుతున్నావుకదా, వాళ్ళిద్దర్నీ తీసుకురా" అనికూడా అన్నాడు.

"రైలుచార్జీ లిచ్చాడా? మీబావ నెరుగుదువుగా?"

"ఇయ్యలేదు, ఇవ్వబోతూవుంటే నేనే వొద్దన్నాను. నాటకంలో కనీసం ఏ అయిదారు వందలో మిగులుతాయా, అవిపెట్టి చీరెలూ, అవీ కొనుక్కుని-వుప్పాడ పంచలు చవకగా దొరుకుతాయిటగా!"

"మరి మిగిల్తే నీ కెందుకిస్తార్రా ఆ డబ్బు?"

ఆలోచించాడు.

"ఆ షరతుమీదనే నేను వొప్పుకుంది."

సూరాయ్ బావకి ఒక అన్న వున్నాడు ఆఇంటో. దున్నపోతువంటి మనిషి తమ్ముడిట్లో భర్తీగా భోంచేయడం ముఖ్యోద్యోగం.

"బావా, ఎప్పుడన్నా నాటకంలో వేషంవేశావా?"

"లేదు. ఏం?"

"ఓ చిక్కొచ్చిందిలే. రేపు రాత్రికి అందరూ హేమాహేమీలూ దొరికారు. కాని జగ్గరాజు రాడేమో అని అనుమానం. రాడులే. కారణం వుంది దానికి. పక్కన వేషం వేస్తే పేరు పడిపోతుందని భయం. ఇంకా అతని సంగీతం చూసేదెవరు? పోనీ నువ్వే వేస్తావా"

"ఏం వేషం?"

"చంద్రమతి."

"నేనా?"

"నువ్వే ! రంగువేస్తే చక్కగా ఉంటావు."

"నిజమే?"

"నిజం."

"పుస్తకం ఏదీ?"

"ఒకటి కొని చదివెయి"

ప్రెస్సుకు వెళ్ళాడు సూరాయ్, వ్రాసికెళ్ళిన నోటీసు అచ్చుకొట్టమన్నాడు.

"అద్భుత నట సమ్మేళనము"

హరిశ్చంద్రుడు-మన ప్రసాదరావుగారి ప్రసాదమే.

చంద్రమతి-నటరాజ జగ్గరాజు మార్తాండుడే రాణి.

నక్షత్రకుడు-లక్ష్మీకాంతముగారి కాంతి మీ రెరుగనిదికాదు.

విశ్వామిత్రుడు-ఒకానొక భీషణోస్మూర్తి. ఎవరో కనుక్కోండి.

లోహితాస్యుడు-బాలకుమరకురంగుడు బాలా త్రిపురసుందరుడు.

కలహకంఠి-గజ్జల గుట్టం.

"ఏమిటండీ, యీ నోటీసు యిల్లావుంది?"

"నాకు తెలీదు. వెంటనే పదివేల కాపీలు కొట్టిమ్మన్నారు. రేపు మధ్యాహ్నం రైలులో వస్తారు."

"సరేలెండి"

సగందూరం వెళ్ళి తిరిగివొచ్చి.

"లోహితాస్యుడికి ఒక కుర్రాడున్నాడా? మామూలుగా వేసేవాడికి పరీక్షలు అడ్డం వచ్చాయి"

"ఎండకాలంలో పరీక్షలేమిటి?"

"అదొక ముదనష్టపు స్కూలు."

"వున్నాడు. కాని వాడికి అక్కడక్కడ రుక్మాంగదలోకి లాగుతుంది."

"పరవాలేదు. పంపండి"

లోహితాస్యుడు కూడా కుదిరాడు.

హాలూ, బళ్ళూ, లైట్లూ, బాండూ నాటకం రాత్రి డబ్బిచ్చే పద్ధతిని కుదిర్చాడు.

అప్పుపెట్టి యిడ్లీ, కాఫీ, కానీయిచ్చి కిల్లీ వేసితే సిగరెట్టు తాగుతో ఒక్కవిశ్వామిత్రుడు దొరికి తక్కినవేషాలు తాత్కాలికంగా....

దభేలున కిందపడ్డాడు. మీద సైకిల్ పడ్డది దానిమీద సాయేబు పడ్డాడు. ముగ్గురూ ఒకరి బంధాలు ఒకరు విడిపించుకోవడం కొంతసేపు పట్టింది. అంతసేపూ సాహెబు అరుస్తూనే వున్నాడు.

సా:-"అరే, చెవుడా నీకు? బెల్ వినపడదు చూడు, చొక్కజేబులో కోడిగుడ్లు అన్నీ చితికి చొంగ అంతా కారుతోంది" గుంపు సరదాగా చూస్తోంది.

"చూడవయ్యా, ని న్నిప్పు డేం చేస్తానో?" అన్నాడు సాహెబు.

"సాహెబుగారూ! విశ్వామిత్రుడి సంగతి విన్నారా?"

"విశ్వామిత్రుడు ఎవడురా! నా కోడిగుడ్ల ఖరీదు-"

"వాడాండీ - వాడో మహర్షి. అతని ఆశ్రమంలోకి హరిశ్చంద్రుడు అనుజ్ఞలేకుండా వెడతాడు మొదటి రంగంలో"

"ఏమిట్రా?"

"మీరు నాటకంలో వేషం వేస్తారా?"

"అరే వీడు పిచ్చివాడులాగున్నాడే"

"రేపు రాత్రి పాకదగ్గిరికి పెందరాళే రావాలి తమరు. ఇంకా నాకు గతిలేదు మీరు తప్ప. మీరు రంగస్థలంమీద అట్లా దూకారంటే - నేనే హరిశ్చంద్రుడు-తల తన్నడం కూడా వుంది - మీకెన్ని వొన్సుమోరులు వొస్తాయో నేను లెక్క చెప్పలేను-"

"అరే, దివానా"

"కాదు. ఇదుగో కాయితం - మీ పేరుకూడా వేశాను చూడండి. ఎంత వెతికినా నాకు తగిన గడ్డం దొరకలేదు విశ్వామిత్రుడికి పెట్టడానికి. ఇంక వెతనక్కర్లేదు."

సాహెబుకి నాటకంలో వేషం వెయ్యాలనేది పసితనంనించిన్నీ జీవితాశయం.

"మరి ఆ తెలుగూ గిలుగూ రాదే!"

"రుషులు అట్టానే మాట్టాడతారు. ఆ భారమంతా నాదే. తమరు రండి."

3

ఎనిమిదియింది. 'ఏదిర నా సీత' అని పెద్ద గొంతుకతో వాపోతున్నాడు, బాకావాడు. సన్నపీకల బాండువాడు 'నా సీత ఏదిరా ?' అని యేడుస్తున్నాడు. పెద్దడోలువాడు 'ఇందులో వుందిర నీ సీత' అని పిలుస్తో బాత్తున్నాడు చేతిసత్తువకొద్దీ. పక్కన స్కూలు కుర్రాడు వొకడు అక్కడ వున్నవాళ్ళందర్నీ 'ఏదిరా నా సీత' అని కనుక్కుంటున్నాడు. లైట్లు గబగబా వెలుగుతున్నాయి. టిక్కెట్లతను వూపిరాడకండా అమ్ముతున్నాడు.

సూరాయ్ తన బావమరిది బావమరదిని టిక్కెట్లమ్మడానికి పెట్టాడు.

సూరాయ్ వేషం తయారయింది. అద్దంలో నిలువునా చూసుకుంటే, ఎవరోవచ్చి ఎదురుగా నుంచున్నట్లుంది అతనికి. ఇంత అందమైన వాణ్ణని తెలీక యిన్నాళ్లు జీవితం వృథాగాగడియపానుగదా, నాకు పిల్ల నెవరిస్తారని పెళ్ళి ప్రయత్నమన్నా చేసుకోలేదు కదా, పోనీ, యే వితంతు శరణాలయం ముందు యిటూ అటూ తిరిగినా ఒక శరణాగతురాలన్నా, ఆలయం వొదిలి తన శరణుచొచ్చి వుండునే అని చాలా చింతపడ్డాడు. 'ఈ నాటకంలో ఓ నాలుగు వందలు దక్కిందంటే, ఆ మూలధనంతో వెంటనే వివాహ ప్రయత్నం చెయ్యాలి. కన్యా, వితంతువా ? నాలుగు వందలు మిగులుతుందా లేదా ?' వేషంలో వున్న సంగతి మరిచి, బిరబిరా, బుక్కింగు గది దగ్గరికి నడిచాడు.

"ఒరేయ్, రారోయ్, సింహడూ, రారోయ్" అన్నాడు ఓ కుంటికుర్రాడు గేటుదగ్గర్నించి. వాడి వెనక నేలయీనినట్టు పదిమంది పోగైనారు.

"ఎంత వొచ్చిందిరా?" అన్నాడు సూరాయ్.

"మూడువందలు చిల్లర" అంటో బావమరిది బావమరిది తలయెత్తి చూసి నిర్ఘాంతపోయినాడు.

బైటనించి కేకలు వినపడుతున్నాయి.

"హరిప్రసాదరావు రా."

"కాదురా. హరిప్రసాదరావు లావు."

"కాయితంలో వేశారంటే."

"ఐతే, వీడు మంత్రేమో !"

"జవానుగాడురా."

"మరి కిరీటమేమిటి ?"

"జవానే యిట్లావుంటే రాజెట్లా వుంటాడో !"

"ఏమండోయ్ , మీది యేం వేషమండి !"

"ఓ పద్యం చదవండి."

సూరాయ్ ఒక్క పరుగున పాకలోదూరాడు.

వేషదారులందరూ పోగైనారు. నక్షత్రకుడు డ్రస్సు అడిగితే, "నక్షత్రుకుడికి డ్రస్సేమిటి? వున్నది తీసేసిరా" అన్నాడు. లోహితాస్యుణ్ణే అంతే. విశ్వామిత్రుణ్ణే అంతే.

"నేను సరిగా తగిన మనుష్యుల్ని చూసే ఏరుకుంటాను. ఇంక వాళ్లు ఏమీ మార్పు లేకుండానే స్టేజీ మీదకు రావొచ్చు" అన్నాడు.

"చంద్రమతికూడా అంతేనా?"

అనడం విని తయారు పూర్తి అవుతున్న చంద్రమతి ఆమూలనించి కదిలి వొచ్చింది. ప్రతివాడూ నవ్వుతో విరగపడ్డాడు. సూరాయ్‌కూడా. లోహితాస్యుడు 'బాబోయ్ !' అని విశ్వామిత్రుణ్ణి కావిలించుకున్నాడు. కట్టిన కొర్నాటిచీర మోకాళ్ల వరకే అందుకోవడంవల్ల కాళ్లు బుట్టబొమ్మల్లో దూరినవాడి వాటివలె మధ్య కదులుతున్నాయి. రంగు పాదాల వరకు పూసి వూరుకున్నాడు రంగులవాడు. "ఏమిరా? కాళ్లకో" అంటే, ఒక పీపాడు రంగూ, పెద్దకుంచా తీసుకురమ్మన్నాడు వాడు. రెవికలూ, జాకెట్లూ, ఒక్కటీ చేతులు దూర లేదు. ఛాతీ యెక్కువయింది. వెనక పమిటవేసి, జబ్బలకి పూసలుకట్టి, 'అజంతా అలంకారం' అని వొదిలేశారు. పమిట కదిలినప్పుడల్లా తెల్లని చేతుల వెనక గుహవంటి చంక కనపడుతోంది. రొమ్ము దిళ్లకి కొత్తతాళ్లుకట్టి నలభైరెండంగుళాల ఛాతీమీద బిగించడంవల్ల చంద్రమతికి వూపిరాడక తాటకి గర్జనాన్ని పోలినట్టు దిగశ్వాసమొదలుపెట్టింది. పైగా ఆ రెండుదిళ్లూ ఛాతీమధ్యగా చేరి, చిన్న కురుపులవలె కనపడుతున్నాయి.

4

మొదటి బెల్. హరిశ్చంద్రుడి వేట సీను.

ప్రతివాడికీ చెప్పాశాడు ఏం చెయ్యాలో. విశ్వామిత్రుడు మాత్రం ఒక్క ముక్క రాదన్నాడు.

"ఏం లేదు. బహుసులభం. అరు-తిట్టు- అప్పుడప్పుడు తన్ను."

రెండో బెల్. తెర యెత్తబోతోవుండగా-

"మాతంగకన్యలేరీ !" అన్నాడు వొకడు.

"అవును. మరిచానే !"

ఆలోచించాడు.

తెరలెత్తేవాణ్ణి పంపి, బైటవున్న యిద్దరు కుర్రాళ్ళకి ఫ్రీ టిక్కెట్లు యిస్తామని పిలిపించాడు. కాని వాళ్ళకి పాట రాదన్నారు. ఒకడు భయమన్నాడు.

టైమ్ ఐపోతోంది. దీపాలు వెలుగుతున్నాయి. జనం గోలచేస్తోంది. బైట బాండువాళ్లు,

'మరువకు డార్యులారా, పంజాబు వధలు !' అని ఆర్యుల్ని పాకదగ్గిరకి రమ్మని ఆహ్వానిస్తున్నారు.

బాండువాళ్లని పిలిపించాడు.

"ఒరే ఏమన్నా, జావలీలు వొచ్చునురా ?"

"నీనామామే ఎంతో రుచిరా, వొచ్చును."

"మంచిది, ఇంకోటి ?"

"మరుగేలరా. ఓ రాఘవా !"

"అదీ జావళీలాగే వుంది. బావుంది. ఈ రెండు జావళీలూ పాడాలి మీరు. మీ రిద్దరూ మాతంగకన్యలు."

"ఏమిటి ?"

"మాతంగ కన్యలు."

"కన్యలా ? మేము కన్యలా ? అంటే?"

ఒకరి బిరుసు గడ్డం ఒకరు చూసుకుంటున్నారు.

అందరూ నవ్వుతున్నారు.

"అది కాదురా. మీ పైబట్టలు కప్పుకుని సైడు కర్టన్‌లో, కొంచెం కనబడుతో ముసుగులు మాత్రం కనపరుస్తో కూచుని పాడండి. చెరోరూపాయి ఎక్కువ యిస్తాను" అంటోనే తెర యెత్తించాడు.

ధనుస్సు పట్టుకుని అడివంతా, పాటతో గుంతులేస్తున్నాడు సూరయ్య, హార్మోనియం గోలలోనూ, తబలా దెబ్బల్లోనూ, ఏం పాడుతున్నాడో మాటలు వినపట్టంలేదు. "చెండాడేదన్ - బంతాడెదన్ -కొండాడెదన్. సింగాడెదన్ - రా-పో, కా, రీ, - తొక్కాడెదన్, గొడ్డాడెదన్ ఛీ పో గో - ఛీ డొక్కాడెదన్, ధిక్కాడెదన్ -"

అని భీషణంగా యిటూ అటూ వురికాడు. ఇంతలో చంద్రమతీ, లోహితాస్యుడూ వొచ్చారు. చంద్రమతి హరిశ్చంద్రుడికి పిచ్చెక్కిందిగావునని 'నాథా !' అని సింహగర్జన చేసేటప్పటికి, హాలంతా గోల !

లోహితాస్యుడు బెదురుతో, కింది దీపాలవరస దగ్గిర నుంచున్నాడు. చంద్రమతి వాడివేపు తిరిగి 'కుమారా' అని పిలిచేటప్పటికి, ఒక్క కేకేసి, లోపలికి పరిగెత్తాడు.

మాతంగకన్యలు సైడ్ కర్టన్ దగ్గిర చప్పుడు చేశారు. వాళ్ళ ముసుగులు తప్ప ఏమీ కనపట్టంలేదు. ప్రతాపరుద్రీయంలో ముమ్మడమ్మల మల్లే వున్నారు.

'సరే. పాట కానీండి' అనేటప్పటికల్లా, రెండు పెద్ద యిత్తడి బాకాలు స్టేజీమీదికి పెట్టి-

'ముద్దిడరారా-' అని పెద్దగా వూదారు.

హరిశ్చంద్రుడు కళ్ళ నిప్పులు రాలుస్తో, పళ్లు పటపట కొరుకుతున్నాడు. తప్పక ఆ కోపంలో పద్యం వుండి తీరుతుందని, హార్మోనియంలో 'వసంత' రాగం అందిచ్చాడు. ఇంతలో లోపల్నించి యెవరో ఆ బాకాలు లాగేశారు. వెంటనే వాళ్ళు కంఠంతోటే అందుకున్నారు. ఆ పాటని, హరిశ్చంద్రుడుకూడా భరించ లేక "చాలు చాలు, ఇందండి బహుమానం" అన్నాడు. హరిశ్చంద్రుడేమిటి? ఆ పాట ఆపినందుకు హాలులో ప్రతివాడూ బాధ ఎక్కువై బహుమానాలివ్వడానికి సిద్ధపడ్డారు.

హరిశ్చంద్రుడు పూలసలహారం వొకటి మెళ్లోంచి తీసి యివ్వబొయ్యేటప్పటికి. ఆ కన్యలిద్దరూ,

'నీ ముద్దు మొగమూ, సొగసు చూసీ-' అని చేతులు జాచి పాడుతో, ఒకర్ని తోసుకు ఒకరు స్టేజి మీదికి వొచ్చారు.

'అరే, అరే' అంటో వాళ్ళని వెనక్కి యీడుస్తో వెనకనే నక్షత్రకుడు కూడా వొచ్చాడు. హాలులో అల్లరి చూసి బెదిరి, ఆ అబలలు బహుమతి నందుకోకండానే వెళ్ళిపోయినారు.

వెంటనే విశ్వామిత్రుడు

"అరే భాంచత్ ! నీకూ ఎంతా పొగర్- చూస్కోరా, నీ అబ్బ!" అంటో సైడ్ కర్టన్‌లోంచి హరిశ్చంద్రుడిమీద ఒక్క దూకు దూకాడు.

చంద్రమతి 'రుషివర్యా' అంటో అడ్డం వెళ్ళింది.

"ఒసే పిశాచీ, ఆడసైతాన్-నీకీ-' అని జుట్టు పట్టుకుని ఒక్క తన్ను తన్నాడు.

టోపారహితంగా చంద్రమతి వెల్లకిలా పడి, 'నీ దుంప తెగా' అంటోంది.

విశ్వామిత్రుడు కూలబడి, చేతులో టోపావొంక విచిత్రంగా చూస్తున్నాడు. విశ్వామిత్రుడు వెంటనే లేచి, నవ్వుతున్న నక్షత్రుకుణ్ణి ఒక్క తన్ను తన్ని.

"ఒరే, రాజా, నీకీ కొంపా తీసేస్తా"

అంటో చూసేప్పటికి హరిశ్చంద్రుడు కోటు రెండుచేతుల్లో పట్టుకుని పరిగెత్తుతున్నాడు.

నక్షత్రకుడివంక తిరిగేప్పటికి వాడు చివాలున లేచి, దోవ దొరక్క, రిజర్వు కుర్చీలో కూచున్న డాక్టరుగారి వొళ్ళో దూకాడు. ఆ డాక్టరు తన వెనక నున్న లేడీ బెంచి మాస్ట్రీటు భుజంమీద తలకాయ పెట్టుకొని మూర్ఛపోయ్యాడు.

ఇంతలో హాలంతా గోల. కొందరు

"వెంకటచలం హరిశ్చంద్ర" అన్నారు.

"హరిప్రసాదరావు ఏడీ ?"

"వీడా నక్షత్రుకుడు ?"

"మాడబ్బు మాకియ్యండి"

అంటో వొచ్చింది గుంపు స్టేజిమీదికి. స్టేజిమీద తిరగబడ్డ విశ్వామిత్రుడి తల కాస్తా. నేలనేసి కొడుతున్న చంద్రమతి యీ గుంపుని చూసి, స్టేజి తలుపులోంచి ఒక్క పరుగున గేటు తెరుచుకొని, టిక్కెట్లు దొరక్క నుంచున్న గుంపుమీదపడి రోడ్డువెంట పరిగెత్తింది. విశ్వామిత్రుడు లేచి హరిశ్చంద్రుడు పారేసి పరిగెత్తిన విల్లుతో కంట్రాక్టరు శంకరయ్యనీ, కంసాలి వీరయ్యని బాదాడు. రెండు నిమిషాలు గుంపు ఆగింది. కాని బస్సుల బాభాసాహెబ్ 'నీ కెందుకురా,భాయ్ !' అనేటప్పటికి విశ్వామిత్రుడు తన దోవన తానుపోయినాడు. అటుతరవాత మహాప్రళయం.

5

రాత్రి పన్నెండు దాటింది, నిశ్శబ్దం, నాటకంపాక వెనకనున్న రక్కిస పొదల వెనకాలనించి, సూరయ్య, మెల్లిగా తలెత్తి చూశాడు యిటూ అటూ. ఆ ముళ్ళమధ్య విశ్రాంతి తీసుకుంటున్నంత సేపూ డబ్బుపెట్టెమీదనే మనసు నిలిపివుండడంచాత అంతమాత్రం వోపిక వొచ్చిందిగాని, లేకపోతే అసలా రాత్రికి అక్కణ్ణించి కదలకపోను. అరణ్యంలో కిరీటం వొదిలి, ముళ్లుగీరుకున్న చేతులతో చిరిగిన మొఖముల్ కోటుతో నాటకంపాక వీధులబడి, ధనం పెట్టెవేపు నడుస్తున్నాడు మహరాజు.

'అడుగో, వొచ్చాడు' అన్నాడు ఎవరో, తటాలున చీకట్లోంచి.

'వొచ్చాడు, వొచ్చా'డని అనేక కంఠాల ప్రతిధ్వనించింది, నాలుగువేపుల్నించీ ఆమాట. మాటలతో పాటు కంఠాలు, కంఠాలతో బాటు కాళ్లూ పరిగెత్తాయి అతనివేపు. అతను గేటుమీద కాంక్షపడ్డాడు. అక్కడ, అడ్డంగా - మాతంగకన్యలు 'వొచ్చాడు' అంటున్నారు. బహుమానం కోసం గావును. యింకా కాచుకొనే వున్నారు.

హరిశ్చంద్రుడు టిక్కెట్ల రూములో దూరి తలుపు బిగించుకున్నాడు. చుట్టూ ప్రెస్సు, లైట్లు, బళ్లు, రంగులు, పాక, బాకాలు, హోటలు అన్నీ 'డబ్బు మాడబ్బు' అని గోల. విశ్వామిత్రుడి అప్పును పైసలతో సహా, రెండుసార్లు బత్యాఖర్చులతో తీర్చిన సత్యసంధుడు, కీర్తిధనుడైన చక్రవర్తిమీద అంత మాత్రం నమ్మకం లేకపోవడం కలికాల మహత్యం గాక యింకేమిటి ? రాజ్యభ్రష్టుడికి తిరిగి రాజ్యమిప్పించి కదా, బాకీ లడగవలసింది !

"సరే, చంద్రమతి పారిపోయింది. లోహితాస్యుడు ఏమైనాడో తెలీదు. నన్ను అమ్మి మీ అప్పులు తీర్చుకోండి" అంటో వొచ్చి నుంచుంటెయేమయ్యేదో!

అప్పటికీ, యీ హరిశ్చంద్రుడు డబ్బు పెట్టెకోసం వెతికాడు. కాని చచ్చిన ముసలమ్మలాగు బోసి నోరు తెరుచుకుని బల్లక్రిందపడివుంది ఆ పెట్టె. పెట్టె వంక చూశాడు. కిటికీలోంచి తొంగిచూసే ప్రజలవంక చూశాడు.

'మాయామేయ జగంబె నిత్యమని సంభావించి లోకబునన్' అనే పద్యం చదివి కిటికీలోంచి కర్రలకి అందకండా పక్కగా పడుకున్నాడు.

'వెధవ ! తెల్లారనీ' అంటో పరివారమంతా గదిచుట్టూ కూచున్నారు.

హరిశ్చంద్రుడనేక పాట్లు పడ్డాడు గాని, యీ నాటికి జైలుప్రాప్తికూడా అయింది.

"ఏమయ్యా ! ఏమంటావు ?"

మాట్లాడడు.

"పదివేలేమిటి ? యాభై వేలు అచ్చు వెయ్యమన్నాడు. ఇందుకేగావును !"

"రెండు లైట్లేమిటి? పదహారు లైటు తెమ్మన్నాడు. పక్కకొట్లో డబ్బిచ్చి ఐదులైట్లు తెచ్చాము."

"వాడికేం, మహారాజు!"

"తిప్పిన బజారే తిప్పి, వూదించాడయ్యా మాచాత, నాటకంలో కూడా బాకా లూదించాడు వీడి తస్సాగొయ్యా ! మేమూ వేషగాళ్లమనుకుని, 'నువ్వేరా జగ్గరాజు, నువ్వేరా, మాతంగకన్య' అంటో తన్నారు మమ్మన్ని" అనుకుంటో నిద్రపోయినారు కావిలివారు. మహరాజు గుర్రుకొడుతున్నాడు - హాయిగా, మొఖమల్ లాగు వేసుకుని.

ఇక్కడ ఇట్లావుండగా మావాడు పరారి అయిన సంగతి మావూళ్ళో, మాయింట్లో అలజడి కలిగించింది. నాలుగువేపులా టెలిగ్రాము లిచ్చారు. కాకినాడలో వున్నాడనీ, వెంటనే

ఎవరన్నా వొచ్చి తీసుకువెడితేనేగాని చిక్కుల్లోకి దిగుతాడనీ, ఆ వూరినించి బదులు టెలిగ్రాం వొచ్చింది. ఆ మధ్యాహ్నమే మా మామయ్య బయలుదేరి రాత్రి పదిగంటలకి కాకినాడు చేరుకున్నాడు. మావాళ్ళ యింటికెడితే, వాళ్ళందరూ కాంప్లిమెంటరీగా నాటకానికి వెళ్ళివుంటడడంచాత యిల్లు తాళంవేసివుంది. ఏమీ తోచక, తెల్లవారింతరవాత చూసుకుందామని అక్కడే అరుగుమీద మకాంపెట్టి పడుకున్నాడు మామయ్య. గంటసేపయింది. అప్పుడే కునుకు పడుతోంది. ఇంతలో యెవరో భూతంలాంటి స్త్రీ అరుగుమీదికి ఒక్క దూకుదూకి, వెంటనే కిందికి దూకి, యింటి చుట్టూ తిరుగుతోంది. ఏదోగాలి స్త్రీరూపాన వొచ్చి తిరుగుతోందని భేతళదండకం చదువుతో, వొణుకుతో, వొదిగి పడుకుని చూస్తున్నాడు. కొంచెం సేపట్లో అది అలిసి, అరుగు దగ్గిర ఆగి, 'ఎవరు?' అంది.

దాని శ్వాస కొండగుహల్లోంచి వీచే తుపాను గాలివలె శబ్దం చేస్తోంది.

"మాది యీవూరు కాదు" అన్నాడు.

అది బీడీ ముట్టించింది. ఆ అగ్గిపుల్ల వెలుతుర్లో మామయ్య మొహం చూచి, ఆభూతం,

'నువ్వా, బాబాయి!' అంటే

ఆ సైజు కూతురు తన కెక్కడా లేదే ! యీ ఆడభూతం తనతో ఆ వరస కలిపిందే అని, యేమని పిలవాలో, మాట్లాడాలో తెలీక తటపటాయిస్తో వుండగా, నాటకానికి వెళ్ళిన మావాళ్ళు వచ్చారు.

"వొరే! తప్పించుకు బైటపడ్డామురా ! బలే నాటకం. వాడేమైనాడో!" అంటో యింటి తాళంతీసి దీపం వెలిగించాడు. భూతంకూడా లోపలికి వొచ్చినుంచుంది. మామయ్యా లోపలికి వెళ్ళాడు.

"వొచ్చావా బాబూ, రక్షించావు"

"సరేగాని, యీ కూతురెవరు?"

"ఇదా! మీ సూరాయి భార్య"

అని అందరూ నవ్వుతున్నారు.

చివరికి సంగతంతా విని పాకదగ్గిరికి వెడతానన్నాడు సూరాయ్ కోసం, మామయ్య.

"లాభం లేదు. వాడు కీరిటం పెట్టుకునే పలాయనమైనాడు. అదిగాక వాణ్ణి చూసినా, గుర్తుపట్టలేవు యీ రాత్రికి. ముందు భోజనం చెయ్యి."

అని అప్పటికప్పుడు వొండి వొడ్డించారు. రెండుగంటలయింది. కాని మామయ్య మనసంతా సూరాయి మీదనే వుంది. 'వెళ్ళి వెతుకుతా'నని బైలుదేరాడు.

"కిరీటధారియై, తన్నులుతిని, వొంటరిగా పొదల్లో సంచారంచేసే రాజాధిరా జెవరన్నా నీకంటబడితే మనవా డనుకో." అన్నారు.

వొచ్చి చూసేప్పటికి మనవాడు గదిలోనూ, చుట్టూ పరిజనమూ - ప్రతాపరుద్రుడు ఢిల్లీకైదులో పడుకున్నట్టుంది రంగం. మామయ్య సూక్ష్మగ్రాహి అత్తయ్య నడవడిలో రహస్యాలు కనిపెట్టే ప్రయత్నాలలో అతని బుద్ధి కుశాగ్రమయింది. గ్రహించాడు వ్యవహారం.

మొదట 'లైట్లని' లేప్తాడు.

"ఎవరు ?" అన్నాడు వాడు.

"మాది తెనాలి"

"అయితే?"

"అడిగితే చెప్పాను."

"నన్నెందుకు లేపావు?"

"నిద్ర వొస్తోంది."

"అయితే?"

"ఇక్కడ పడుకోనా?"

"పడుకో."

"మీరందరూ సుఖంగా పడుకుంటే యీ రాళ్లు మెత్తగా వున్నా యనుకున్నాను."

"మా ఖర్మ మిట్లా కాలింది! మీ రెందుకు తటస్థపడ్డారు?"

"మా మేనల్లుడు పిచ్చివాడొకడున్నాడు. వాడి కోసం యీవాళంతా యీవూళ్ళో వెతికి వెతికి కాళ్లు కాయలు కాసిపోయినాయి."

"ఏమైనాడేమిటి?"

"వాడికి పిచ్చి. అంటే కొన్నిరోజులకి వోనాడు తానింకోమనిషి ననుకుంటో వుంటాడు. కొన్నాళ్లు తాను ఆనందగజపతిని అని మా గడ్డి మాకు పెట్టాడు. కొన్నాళ్లు శ్రీకృష్ణుణ్ణి అని కనపడ్డవాళ్ళల్లా గోపికలని ముద్దుపెట్టాడు. నాలుగురోజుల్నించి ఆ నాటకాలు రాశే లక్ష్మీకాంతాన్నని, నాటకా లాడిస్తానని యింటోంచి పరుగెత్తుకొచ్చాడు."

"ఎట్లా వుంటాడు?"

"సన్నగా యెర్రగా-కళ్ళమధ్య గాటు"

"అడుగో! ఆ లోపల!"

"ఎక్కడ?"

"లోపల చూడండి. ఇట్లా రండి."

"ఛా! మావాడు కాడు. ఆయనెవరో బొబ్బిలి మహరాజా"

"కాదండీ. వేషంమీద వున్నాడు. పిలవండి"

వాళ్ళందరూ పిలిచారు; లేవలేదు.

మామయ్య-"ఒరే, వెర్రి వెంకట్రాముడూ-ఎంతపని చేశావురా నాయనా," అనేటప్పటికి ఆ కంఠం విని సూరాయి చప్పున లేచాడు.

"పో, పో, వెంకట్రాము డెవడు?"

"చూశారా! వాడికి పూర్తిగా మతిపోయింది. తలుపు తెరవండి నాయనా!"

"లోపల గడియ వేసుకున్నాడు."

"ఇంటిదగ్గిరా యింతే. మాపక్కనున్న పోలీసు యినెస్పెక్టరు భార్యని సత్యభామ అని కావిలించుకున్నాడు. తన్నడానికి వొస్తే గదిలోదూరి తలుపులేసుకున్నాడు."

"వెంకట్రాముడూ, ప్రస్తుతం నీపేరేమిట్రా?"

"నాపేరా? సూర్యనారాయణ. ఏమంటావు?"

"ఎన్నాళ్లయిందండీ మావాడు ఈ వూరువొచ్చి?"

"ఏమో, మేము మొన్నణ్ణించి చూస్తున్నాము."

"ఆ. ఎవర్నీ యింతవరకు కరవలేదుకద! కరిస్తే వాళ్ళకీ వొస్తుంది ఆ పిచ్చి "

"ఆ-"

అందరూ లేచారు ఆ మాటతో.

"ఎట్లా నాయనా?"

"ఏం చెయ్యం?"

"తలుపు తెరవరా, వెంకట్రాముడూ?"

"పో, వెధవా, నీ వెంకట్రాముడూ నువ్వూనూ! నిద్రలేక చస్తోవుంటే!"

"రెండురోజులు బాగానేవుంటాడు. సరిగానే మాట్లాడతాడు. ఏదన్నా చిరాకు రాగానే యిట్లా అవుతాడు. అప్పుడింక ఎదటపడ్డవాళ్ళని కరుస్తాడు. అందులో సూర్యనారాయణ పేరులో వున్నాడా, మరీ కాట్లకుక్క అవతారం. ఇంకేం చెయ్యను? నేనుపోయి పడుకుంటాను. నాయనలారా, ఎక్కడికన్నా పరిగెత్తుతాడేమో, జాగ్రత్తగా చూస్తోవుండండి. అట్లా పడుకున్నట్టే పడుకుని, తలుపు తెరుచుకునివొచ్చి, కనపడ్డవాణ్ణల్లా కరిచి కనపడకుండా పరిగెత్తుతాడు. జాగ్రత్త, వాళ్ళ అమ్మకి వీడు ఒకడే. పోనీకండి, బాబూ" అంటో మెల్లిగా వెడుతున్నాడు.

"పంతులుగారూ,పంతులుగారూ !"

"ఏమిటి?"

"మేము వెళ్లాలండి. మీ పిల్లవాణ్ణి మీరు చూసుకోండి."

"అదేమిటి నాయనా! ఇంతసేపూ వాణ్ణి ఆదరించి, కనిపెట్టివుండీ, ఇప్పుడిట్లా మధ్యలో వొదిలేసిపోతే ఎలా?"

వినిపించుకోకుండా, తలలమీద గుడ్డలు వేసుకుని, ప్రెస్సు, బాజాలు అన్నీ వీధిలోకి నడుస్తున్నాయి. వాళ్లని పోనిచ్చి

"ఒరేయ్, సూరాయ్-వెధవా, లేవరా యింక"

కళ్లు నులుముకుంటో మావాడు లేచాడు.

"మామయ్యా!"

"నేనే. తలుపు తెరు."

"వాళ్లు తంతారు"

"ఎవరూలేరు. తెరు."

మామయ్య సూరాయ్‌ని తెల్లారగట్టే రైలెక్కించి యింటికి తీసుకొచ్చాడు.

◆ ◆ ◆

ప్రచురణ : (విచిత్రవనీయం కథలు), ఎమెస్కో, 1967